

16న అవిశ్వాస సమావేశం

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస నోటీసులకు కలెక్టర్ శశాంక స్పందించారు. 8లో▸



లోక్‌సభ ఎన్నికలకు శిక్షణ

ఎంపీ ఎన్నికల్లో పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలని సంగీత అన్నారు. 8లో▸



నకిలీ మద్యం ధ్వంసం

రూ.1.30 కోట్ల విలువైన నకిలీ మద్యం సీసాలను హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. 8లో▸



ఓవరాల్ చాంపియన్‌షిప్ కప్‌ను అందుకుంటున్న సీపీఆర్ గ్రూప్

క్రీడలతో రెట్టింపు ఉత్సాహం

హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్

హుడాకాంప్లెక్స్: క్రీడా పోటీలతో పోలీసులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారని రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ అన్నారు. సరూర్‌నగర్‌లో ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాచకొండ పోలీస్ కమిషనరేట్ 5వ వార్షిక స్పోర్ట్స్‌మీట్–2024 శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జితేందర్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నదని తమ కర్తవ్య నిర్వహనలో భాగంగా రేయింబవళ్లు పనిచేయాల్సి ఉంటుందన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ శాంతిభద్రతల నిర్వహణలో, నేర నియంత్రణలో జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ.. స్పోర్ట్స్ మీట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న పోలీసులకు మానసిక ఉల్లాసాన్ని అందించే లక్ష్యంతో ప్రతి ఏటా స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. కమిషనరేట్ పరిధిలోని జోన్లు వివిధ పోలీసు విభాగాల నుంచి మొత్తం ఎనిమిది జట్లు క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, రన్నింగ్, చెస్, బ్యాడ్మింటన్ వంటి ఇండోర్, అవుట్‌డోర్ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. కమిషనరేట్ మినిస్ట్రీరియల్ సిబ్బంది సైతం క్రీడా పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. అనంతరం టగ్ ఆఫ్ వార్ పోటీల్లో సీపీ సుధీర్‌బాబు గ్రూప్‌పై జితేందర్ గ్రూప్ విజయం సాధించింది. కార్యక్రమంలో డీసీపీలు రాజేష్‌చంద్ర, పద్మజ, గిరిధర్, ప్రవీణ్‌కుమార్, సునీతరెడ్డి, ఎస్‌ఓటీ మురళీధర్, డీసీపీ అడ్మిన్ ఇందిర, అదనపు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

మట్టి మాఫియా!

మట్టి మాఫియా అక్రమాలకు అడ్డూ.. అదుపు లేకుండా పోతోంది. వీరి ఆగడాలు మూడు జేసీబీలు.. ఆరు టిప్పర్లు అన్న చందంగా మారింది. ఈ అక్రమ దందాకు కొండలు, గుట్టలు మాయమవుతున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, మైనింగ్ శాఖ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- అడ్డగోలు తవ్వకాలు.. అర్ధరాత్రి తరలింపు
- కొండలు, గుట్టలు మాయం
- పచ్చని పల్లెల్లో మట్టి, మైనింగ్ కాలుష్యం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్, ఇబ్రహీంపట్నం కేంద్రంగా భారీ దందా



అర్ధరాత్రి టిప్పర్లలో తరలిస్తున్న మట్టి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్ భూములే లక్ష్యంగా అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతోంది. కొండలు, గుట్టలు మాయం చేస్తోంది. అడ్డువచ్చిన చెట్లను అడ్డంగా నరికివేస్తుంది. ఫలితంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు మారుమూల గ్రామాల్లోని రోడ్లు దెబ్బ తింటున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా రోజు వందల లారీల కొద్ది మట్టి తరలిపోతున్నా.. ఇటు మైనింగ్ కానీ, అటు రెవెన్యూ యంత్రాంగం కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. స్థానికులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. తాత్కాలికంగా తనిఖీలు చేస్తున్నారు. వారి నుంచి లారీల వారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. నిజానికి ఏదైనా భూమిలో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే ముందు మైనింగ్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతి తీసుకోవాలి. తవ్వకాల విస్తీర్ణాన్ని బట్టి పన్ను చెల్లించాలి. కానీ జిల్లాలో ఏ ఒక్కరు అనుమతి తీసుకున్న దాఖలాలు లేవు. ఒకరిద్దరు అనుమతి తీసుకున్నా.. వారు అనుమతి పొందిన విస్తీర్ణం కంటే ఎక్కువ తవ్వకాలు చేపట్టి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

మైనింగ్ VS మట్టి మాఫియా

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పరిధిలోని బండరావిర్యాల సర్వే నంబర్ 268లోని ప్రభుత్వ భూమి, కోహెడ్ సర్వే నంబర్ 167/9, 167/10లోని ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. ఇటీవల ఇదే అంశంపై బండరావిర్యాల మైనింగ్ జోన్ యజమానులకు, మట్టి మాఫియాకు మధ్య పెద్ద యుద్ధమే కొనసాగింది. మైనింగ్ జోన్ రోడ్లకు అడ్డంగా మట్టి లారీలను నిలిపి, క్రషర్ యజమానులపై దాడులకు దిగారు. మైనింగ్‌జోన్ నుంచి అనుమతులు తీసుకోవాలి. కానీ వీరు ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఇక్కడి నుంచి వేల సంఖ్యలో లారీలు వెళ్తుంటే.. కేవలం పదుల సంఖ్యల్లోనే కేసులు నమోదు చేయడాన్ని పరిశీలిస్తే.. అధికారుల అవినీతి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

రోజుకు 150 లారీల మట్టి

మహేశ్వరం మండలం ఉప్పుగడ్డ తండా సర్వే నంబర్ 136లోని ప్రభుత్వ అసైన్డ్ భూమి, నాగిరెడ్డిపల్లిలోని టీఎస్ఐఐసీ ఐటీ పార్కు కోసం సేకరించిన భూముల్లో, తుమ్మలూరులోని ఏనమీద సైతం మట్టితవ్వకాలు కొనసాగుతున్నాయి. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ర్యావిర్యాల, కొంగురకుర్దు–ఎ రెవెన్యూ సర్వే నంబర్ 289లోని(జిల్లా కలెక్టరేట్ వెనుక భాగంలో) ప్రభుత్వ భూమిలో కొంత కాలంగా మట్టి మాఫియా తవ్వకాలు చేపడుతోంది. రాత్రి వేళ గుట్టు చప్పుడుకాకుండా తవ్వకాలు చేపడుతోంది. శ్రీనగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 237 కోర్టు వివాదంలో ఉన్న భూమిలోనూ తవ్వకాలు జరుపుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి అండదండలతో ఈ మాఫియా రెచ్చిపోతోంది. ఈ మండలం నుంచి రోజుకు కనీసం 150 లారీల మట్టి తరలి పోతోంది. వెంచర్లకు, ఇటుక బట్టీలకు ఈ మట్టిని తరలిస్తున్నారు. టిప్పర్లు ఓవర్‌లోడు వెళ్తుండటంతో సమీప గ్రామాలపై దుమ్ముధూళి పేరుకుపోతోంది.

ఇరు శాఖల సహకారం

చిప్పలపల్లి, నేదునూరు, తిమ్మాపూర్, జబ్బారీగూడ, గూడూరు, కొత్తూరు, దాసర్లపల్లి, గుమ్మడవెల్లి, మాదాపూర్, ఆకులమైలారం, అన్నోజిగూడల్లోనూ భారీగా తవ్వకాలు చేపడుతున్నారు. వీరికి రెవెన్యూ, మైనింగ్ అధికారులు సైతం సహకరిస్తున్నారు. అనుమతులు లేకున్నా.. తీసుకున్నట్లు లేఖలు చూపిస్తున్నారు. ఇటీవల ఉప్పుగడ్డ తండా వద్ద ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసి, అక్రమంగా మట్టిని తరలిస్తున్న 20 మందిని అరెస్టు చేశారు. ఓ కారు సహా టిప్పర్లు, జేసీబీ, ఇటాచీలను సీజ్ చేశారు. కందుకూరు రెవెన్యూ అధికారులు ఇటీవల కొత్తూరు, గూడూరులలో తనిఖీలు నిర్వహించి, రెండు జేసీబీలు, నాలుగు టిప్పర్లు సీజ్ చేశారు. అధికారులపై మట్టి మాఫియా దాడులకు పాల్పడినట్లు తెలిసింది. ఈ అంశంపై కేసు నమోదైనట్లు సమాచారం.

అసైన్డ్ భూముల్లో రెచ్చిపోతున్న అక్రమార్కులు

ఇబ్రహీంపట్నం మండలంలో కొంగరకలాన్, ఉప్పరిగూడ, పోచారంలోనూ మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మంచాల మండలం లింగంపల్లిలోని ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోనూ భారీగా తవ్వకాలు చేపడుతున్నారు. నిర్మాణదారులకు టిప్పర్‌కు రూ.5 వేల చొప్పున విక్రయిస్తున్నారు. శంషాబాద్ మండలం మదనపల్లి సర్వే నంబర్ 50లోని ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో అడ్డగోలు తవ్వకాలు చేపడుతున్నారు.అదే విధంగాసయ్యద్‌గూడ, పాలమాకులలోని తవ్వకాలు చేస్తున్నారు.

‘నేవీ రాడార్’ను మరో చోటుకు మార్చండి

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధి పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలోని పూడురు మండలం దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని మరో చోటుకు మార్చాలని బీఆర్ఎస్ ఎంపీ డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర రక్షణ శాఖ పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. దామగుండంలో రాడార్ స్టేషన్ నిర్మించడం వల్ల 400 సంవత్సరాల పురాతనమైన రామలింగేశ్వర స్వామి దేవాలయం, విలువైన అటవీ, ఔషధ వృక్షాలు కాలగర్భంలో కలిసే ప్రమాదం ఉందన్నారు. దీనికి తోడు ఈ రాడార్ స్టేషన్ ఏర్పాటు అనంతరం ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని స్థానిక ప్రజల్లో అనుమానాలు, ఆందోళనలు పెరిగాయని స్పష్టం చేశారు. పూడురు మండల ప్రజానీకం నుంచి తీవ్ర అభ్యంతరాలు వస్తున్నాయని ఆయన వెల్లడించారు. పార్లమెంటరీ రూల్ 377 కింద లోక్‌సభలో ప్రత్యేకంగా రంజిత్‌రెడ్డి ఈ ప్రశ్న లేవనెత్తారు. స్థానిక ప్రజలు ఆందోళనలను పరిశీలించిం కేంద్ర రక్షణ శాఖ తన నిర్ణయాన్ని మార్చుకోవాలని సూచన చేశారు. నేవీ రాడార్ స్టేషన్‌ను అక్కడి నుంచి మార్చి వేరే అనువైన ప్రదేశానికి మార్చాలని కోరారు. ఈ విషయంపై స్థానిక ప్రజలు గత కొద్ది రోజులుగా ఆందో ళన చేస్తున్న విషయం తెలిసిందే.

కౌన్సిలర్ నిరంజన్‌రెడ్డిపై వేటు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కాంగ్రెస్ నేత, ఆదిబట్ల మున్సిపల్ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డిపై పీసీసీ క్రమశిక్షణ సంఘం వేటు వేసింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి.చిన్నారెడ్డి ఈ మేరకు శనివారం ఒక లేఖను విడుదల చేశారు. నిరంజన్‌రెడ్డి ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జనవరి 8న కలెక్టర్‌కు సైతం అవిశ్వాస తీర్మానం లేఖను సమర్పించారు. అనంతరం ఆయన అదే రోజు తన బృందంతో కలిసి క్యాంపునకు వెళ్లిపోయారు. చైర్‌పర్సన్ పదవీ కాలం మరో ఆరు నెలల్లో ముగియనుందని.. ఇలాంటి పరిస్థితుల్లో అవిస్వాశ తీర్మానం ప్రవేశపెట్టడం ఏమాత్రం మంచిది కాదని.. ఈ నోటీసులను వెనక్కి తీసుకోవాలని, క్యాంపుల నుంచి తిరిగి రావాల్సిందిగా కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. వారు విన్పించుకోకుండా మొండిగా ముందుకు వెళ్లడంతో ఎమ్మెల్యే పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

పార్టీని కాపాడేందుకే..

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీని బ్రతికించేందుకు మాత్రమే నేను ప్రయత్నం చేస్తున్నానని పార్టీ అధిష్టానం సస్పెన్షన్‌పై పునరాలోచించాలని ఆదిబట్ల మున్సిపల్ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి కోరారు. మంచాల మండలంలో జనరల్ మహిళా స్థానంలో తన భార్యను జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలిపించి.. ఆదిబట్లలో కౌన్సిలర్‌గా గెలిచానన్నారు. గతంలో కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్ లోకి వెళ్లి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారని ఆనాడు పార్టీకి నష్టం చేస్తే ఎవ్వరు పట్టించుకోలేదన్నారు. ఇప్పటి మంత్రి కోమటిరెడ్డి ఎక్స్ అఫిషియోగా ఓటేశారని గుర్తుచేశారు. నాటి నుంచి ఆమె కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవలేదన్నారు. పార్టీ ద్రోహులపై చర్యలు తీసుకోకుండా పార్టీ కోసం కష్టపడే నాలాంటి నాయకుడిపై వేటు వేయడం తగదన్నారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి నోటీసులకు జవాబు ఇచ్చానని.. సస్పెన్షన్‌పై పునరాలోచించాలని కోరారు.

న్యూస్‌రీల్

జిల్లా స్థాయిలో మెరిసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి



షీల్డ్ అందుకుంటున్న వైష్ణవి

కేశంపేట: సాంఘిక శాస్త్రం టాలెంట్ టెస్టులో కొత్తపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని మొదటిస్థానంలో నిలిచింది. పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. శనివారం హయత్‌నగర్ జెడ్పీహెచ్ఎస్‌లో సాంఘిక శాస్త్రం జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారని చెప్పారు. జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు హాజరవ్వగా కొత్తపేట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన వైష్ణవి ఇంగ్లిష్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ సదర్భంగా విద్యార్థినికి ప్రశాంసాపత్రం, షీల్డ్, నగదు బహుమతితో సత్కరించారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని మండల విద్యాధికారి మనోహర్, పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్షుడు శ్రీనివాససాగర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, సాయిప్రసాద్, సుజాత, కృష్ణయ్య, శిరీష, విజయశ్రీ, హారతి అభినందించారు.

హైదరాబాద్ గ్రోత్ కారిడార్ ఎండీగా ఆమ్రపాలి

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలికి హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌గా ప్రభుత్వం పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు హెచ్ఎండీఏ కమిషనర్ దానకిషోర్ ఉత్తర్వులు విడుదల చేశారు. హెచ్‌జీసీఎల్ ఇన్‌చార్జి ఎండీగా విధులు నిర్వహించిన అప్పటి చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి తన పదవులకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ శశాంక

ఇంటింటికీ తాగునీరు

- నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి
- పంచాయతీల్లో శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్
- అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాలు జారీ చేశారు. శనివారం గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, పంచాయతీ రాజ్ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం సంబంధిత శాఖల సిబ్బందితో మాట్లాడారు. వేసవి సీజన్ ప్రారంభం అవుతున్న దృష్ట్యా, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి ఎద్దడి ఉత్పన్నం కాకుండా, ఇంటింటికి రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించడం, క్లోరినేషన్, పైప్ లైన్ లీకేజీల మరమ్మతులు తదితర అంశాలపై దృష్టి సారించాలని చెప్పారు. వీటితో పాటు మొక్కల పెంపకం, తడి, పొడి చెత్త వేరుచేయడం, నర్సరీల నిర్వహణ, పన్ను వసూళ్ల వంటి బాధ్యతలను పక్కాగా నిర్వర్తిస్తూ, ఆయా పనులను నిశితంగా పర్యవేక్షించాలన్నారు.


7 నుంచి 15 వరకు స్పెషల్ డ్రైవ్

గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమితులైన స్పెషల్ ఆఫీసర్లు తమ బాధ్యతలను గుర్తించి ప్రజలకు సమర్థవంతంగా సేవలందించాలని సూచించారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించిందని.. వారంతా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్లకు వారి అధికారాలు, బాధ్యతల గురించి సంపూర్ణ అవగాహన కల్పించేందుకు త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని, ఇందుకు ఏర్పాట్లు చేయాల్సిందిగా సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల7 నుండి 15 వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టి పల్లెలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఆదర్శంగా నిలిచిన ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి పండుగ వాతావరణంలో సన్మానిస్తామని చెప్పారు. యువత, మహిళలను స్పెషల్ డ్రైవ్ లో పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని, యువత వ్యసానాలకు దూరంగా ఉంటూ గ్రామ ప్రగతిలో మమేకం అయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. పార్కులు, ఇతర పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి ముందే గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ పథకాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్, డీఆర్డీఓ పీడీ ప్రభాకర్, పంచాయతీ రాజ్ ఇంజినీర్లు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాత డాక్యుమెంట్లు దొంగ రిజిస్ట్రేషన్లు!

భూముల ధరలకు రెక్కలు రావడంతో కొందరు అక్రమార్కులు పాత డాక్యుమెంట్లను సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. ఎన్ఆర్ఐలకు చెందిన ప్లాట్లు, వివాదాస్పద భూములపై కన్నేసిన పలువురు స్థిరాస్తి వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లు ముఠాగా ఏర్పడి ఈ దందా సాగిస్తున్నారు.

- అక్రమాలకు అడ్డాగా రిజిస్ట్రార్ కార్యాలయాలు
- ఎల్బీనగర్, శంషాబాద్‌లో ప్రత్యేక ముఠాలు
- ఎన్ఆర్ఐల ప్లాట్లు, వివాదాస్పద స్థలాలపై కన్ను
- పాత స్టాంపు పేపర్లతో ఫేక్ అగ్రిమెంట్లు.. యథేచ్ఛగా కబ్జాలు
- సబ్ రిజిస్ట్రార్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఓ ఎమ్మెల్యే



సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా మారాయి. అడిగినంత ఇస్తే చాలు కనీసం లింకు డాక్యుమెంట్లు చూడకుండానే వివాదాస్పద, ఖాళీ, ప్రభుత్వ స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఎల్బీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇందుకు వేదికగా మారుతోంది. ఈ వ్యవహారాన్ని స్థానిక ఎమ్మెల్యే ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం గమనార్హం. కొంత మంది డాక్యుమెంట్ రైటర్లు, స్థానిక లీడర్లుగా చలామణి అవుతున్న పలువురు రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ముఠాగా ఏర్పడి పాత వెంచర్లలోని ఎన్ఆర్ఐలు, డాక్యుమెంట్లు పోగొట్టుకున్న బాధితులే లక్ష్యంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇందుకోసం పాత స్టాంపు పేపర్లను వినియోగిస్తున్నట్లు సమాచారం.

వివాదాస్పద ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు

జిల్లా వ్యాప్తంగా 20కి పైగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులున్నాయి. వీటిలో చంపాపేట్, వట్టినాగులపల్లి, ఎల్బీనగర్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, మెయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, తదితర సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు అక్రమాలకు వేదికగా మారాయనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ, అసైన్డ్, కోర్టు వివాదాల్లోని సర్వే నంబర్లలో వెలసిన వెంచర్లలోని ప్లాట్లకు సైతం ఇక్కడ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా పాత(పదేళ్ల క్రితం) స్టాంపు పేపర్లను ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పాత తేదీల్లో అగ్రిమెంట్లు చేసుకున్నట్లు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారు. శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో తరచూ ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఇప్పటికే ఇక్కడ పని చేసి న ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు ఇదే కారణంగా బదిలీ అయిన విషయం తెలిసిందే.

ఇస్తే సరి.. లేదంటే కిరికిరి!

ఇక్కడి సిబ్బంది చేయి తడపనిదే ఏ పని జరగదు. సాధారణ ఈసీ, సీసీ, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్లే కాదు కీలకమైన భూముల రిజిస్ట్రేషన్ ఇలా ఏదీ కావాలన్నా.. వారికి రూ.500 నుంచి రూ.1,500 వరకు ముట్టజెప్పాల్సిందే. నేరుగా వెళ్తే ఏ పని కాదు. ప్రతీ చిన్న పనికి డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయించాల్సిందే. డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వెళ్లిన వారికే తొలి ప్రాధాన్యం. ఎస్ఆర్ఓలు సైతం ఆయా డాక్యుమెంట్లకు ప్రత్యేక నంబర్లు ఇచ్చి, సాయంత్రం వారి నుంచి రావాల్సిన మొత్తాన్ని వసూలు చేసుకుని వెళ్తుండటం విశేషం. ఇచ్చేందుకు నిరాకరించిన వారికి రకరకాల కొర్రీలు పెట్టి.. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.10 లక్షల పైమాటే..

కర్మన్‌ఘాట్ రెవెన్యూ సర్వేనంబర్ 60 జెడ్పీ రోడ్డులో..44 ఏళ్ల క్రితం ఓ పాత వెంచర్ ఏర్పాటైంది. ఇందులో పదికిపైగా ప్లాట్లను కబ్జా పెట్టడంతో పాటు..పాత డాక్యుమెంట్లు సృష్టించి డబుల్ రిజిస్ట్రేషన్లు చేయించినట్లు తెలిసింది. ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు స్థల విస్తీర్ణాన్ని బట్టి రూ.10 లక్షలకుపైగా ఆయా ఎస్ఆర్ఓలకు ముట్టజెప్పినట్లు సమాచారం.ఇదే ప్రాంతంలోని మరో పాత వెంచర్(సర్వే నం.58)లో పార్కు స్థలం కోసం వదిలిన స్థలాన్ని సైతం ఇతరుల పేరున రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం.ఖాళీ ప్లాటు కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే అందులో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయడం, అక్రమంగా అందులోకి చొరబడటం,ప్లాటు ఓనర్ వచ్చిన తర్వాత వారిని బెదిరించడం,వారి నుంచి డాక్యుమెంట్లు లాగేసుకోవడం వంటివి పరిపాటి గా మారింది.విధిలేని పరిస్థితిలో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండగా చివరికి వారు సెటిల్‌మెంట్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్ప డుతున్నారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు.

చిరుతపులి మృత్యువాత

పెద్దఎల్కిచర్ల అడవిలో పోస్టుమార్టం నిర్వహించిన వెటర్నరీ శాఖ అధికారులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల అడవిలో ఓ చిరుత కళేబరం లభ్యమైంది. అధికారులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. గొర్రెలు తీసుకుని అడవిలోకి వెళ్లిన కాపరులకు శనివారం చిరుత కళేబరం కనిపించింది. విషయాన్ని అటవీశాఖ అధికారులు జమీల్, అజీజ్‌కు తెలియజేశారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న వారు పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పశువైద్యులు శిరీష, ప్రసన్న, ముక్కంటి రాజు కళేబరానికి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం చిరుత అవయవాలను హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. రిపోర్ట్ వచ్చిన తర్వాతే కారణాలు తెలుస్తాయన్నారు.



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పార్లమెంట్ ఎన్నికలకు శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడారు. ఎన్నికలు సవ్యంగా జరిగేలా ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈవీఎంలు, వీవీప్యాట్లు, కంట్రోల్ యూనిట్లపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని వెల్లడించారు.

ఉద్యోగిని వేధించి.. కటకటాల్లోకి

వెంగళరావునగర్: తన సంస్థలో పనిచేస్తున్న యువతి కోసం అమెరికా నుంచి వచ్చిన ఓ సీఈఓ.. ఆమెను వేధించి కటకటాల పాలైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీర్‌పేటలో ఉన్న ఇన్ఫోగ్రావిటీ సంస్థ సీఈఓ చంద్ర అమెరికాలో ఉంటాడు. ఇండియాలో తన కంపెనీ అభివృద్ధిలో భాగంగా నిరంతరం జూమ్ సమావేశాలు నిర్వహిస్తూ.. ఉద్యోగులకు సలహాలు, సూచనలు ఇస్తుంటాడు. ఈ క్రమంలో తన కంపెనీ (అమీర్‌పేట సంస్థ)లో హెచ్‌ఆర్‌గా విధులు నిర్వహిస్తున్న యువతిపై మనసు పారేసుకున్నాడు. ఇండియాకు వచ్చిన చంద్ర ఆమెను వేధించసాగాడు. దీంతో ఆ యువతి ఉద్యోగానికి రాజీనామా చేసింది. తనకు సెటిల్‌మెంట్ చేయాలని కోరింది. అయితే తన కోర్కె తీరిస్తేనే, సెటిల్ చేస్తానని చంద్ర చెప్పడంతో ఆమె ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

16న 'పట్నం' అవిశ్వాస సమావేశం

నోటీసులకు స్పందించిన కలెక్టర్



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస నోటీసులకు కలెక్టర్ శశాంక స్పందించారు. ఈ నెల 16న ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశానికి ముహూర్తం ఖరారు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులకు, కౌన్సిలర్లకు ఈ సమాచారాన్ని ఇచ్చారు. గత నెల 8న మున్సిపల్ పాలకవర్గంలో 24 మందికి గాను 17 మంది కౌన్సిలర్లు చైర్ పర్సన్ కప్పరి స్రవంతిపై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ కలెక్టర్‌కు నోటీసులిచ్చారు. ఈ 17 మందిలో ఇద్దరు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. 16 మంది సభ్యుల మద్దతుంటే అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంటుంది. బీఆర్ఎస్ అత్యధిక కౌన్సిలర్ల స్థానాలను కైవసం చేసుకోవడంతో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచన మేరకు కప్పరి స్రవంతి చైర్ పర్సన్ పీఠంపై కూర్చున్నారు. ఏడాదిన్నర కాలంగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో ఏర్పడిన విభేదాలతో అసెంబ్లీ ఎన్నికల ముందు చైర్ పర్సన్ స్రవంతి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం చైర్ పర్సన్ బాటలోనే నడిచారు. కాగా కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కారెక్కారు. బీఆర్ఎస్ నుంచి సీతారాంపేట కౌన్సిలర్ కొంద్రు శ్రీలత చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. నోటీసులు అందజేసిన వారిలో ఇద్దరు సభ్యులు చేజారినా ఈ అవిశ్వాస ప్రక్రియ వీగిపోయే అవకాశం ఉంటుంది.

సమాచారం ఇచ్చాం



అవిశ్వాస నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఈనెల 16న మున్సిపాలిటీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. ఇప్పటికే సమావేశ సమాచారాన్ని కౌన్సిలర్లకు అందజేశాం. ఈ అవిశ్వాస ప్రక్రియకు ప్రొసీడింగ్ అధికారిగా ఆర్డీఓ అనంతరెడ్డి వ్యవహరించనున్నారు.

– రవీంద్రసాగర్, కమిషనర్

'టీచర్ల నగరబాట'పై చర్చ

డిప్యూటేషన్ ఉపాధ్యాయుల జాబితా సిద్ధం చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

షాద్‌నగర్‌రూరల్: పల్లె పాఠశాలల్లో పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులు డిప్యూటేషన్ పేరుతో పట్టణ పాఠశాలలకు వెళ్లారు. ఇదే అంశంపై ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌పై 'టీచర్ల నగరబాట' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురించింది. దీనికి స్పందించిన విద్యాధికారులు.. డిప్యూటేషన్‌పై వెళ్లిన వారి జాబితాను సిద్ధం చేయాల్సిందిగా ఎంఈఓలకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఉన్నతాధికారుల జోక్యం చేసుకోవడంతో.. తదుపరి పరిణామలపై ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ మొదలైంది.

వివరణ కోరిన విద్యాధికారులు

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయుల వివరాలను జిల్లా విద్యాధికారులు కోరినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయా మండలాల విద్యాధికారులు జాబితాను సిద్ధం చేసి, అందజేసినట్లు సమాచారం. ఒక్క నియోజకవర్గంలోనే ఇంత మంది డిప్యూటేషన్‌పై వెళ్తే.. జిల్లా వ్యాప్తంగా ఎంత మంది ఉంటారనే చర్చ జరుగుతోంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి, డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులను, తిరిగి సొంత మండలాలకు పంపుతారా లేదా అనే విషయం వేచిచూడాల్సిందే.

డిప్యూటేషన్‌పై వెళ్లిన వారు వీరే..

ఆరు మండలాల పరిధిలో సుమారు 50మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఫరూఖ్‌నగర్ మండలంలో నాగులపల్లి, శేరిగూడ, గంట్లవెల్లి, ఎలికట్ట(ఇద్దరు), తోకరేగడితండా, నేరళ్లచెరువు (ముగ్గురు), జీడీవోడ్కతండా, లింగారెడ్డిగూడ, అయ్యవారిపల్లి, బూర్గుల(ఇద్దరు), చించోడ్, మంగలిగడ్డతండా(నలుగురు) కొందుర్గు మండలంలో అయోధ్యతండా, కొందుర్గు, ఉత్తరాస్‌పల్లి, చౌదరిగూడ మండలంలో చింతకుంటతండా, దామరగిద్దతండా, ఇంద్రానగర్, రావిర్యాల, కేశంపేట మండలంలో నానుతండా, బల్జరాళ్లతండా, నాగుర్లగడ్డతండా, లేమామడి, తొమ్మిదిరేకుల, కొత్తపేట, లింగందన, కేశంపేట, పాపిరెడ్డిగూడ, నిర్దవెల్లి, నందిగామ మండలంలో మంచన్‌పహాడ్, నందిగామ, బుగ్గోనిగూడ, నర్సప్పగూడ, మేకగూడ, ఈదులపల్లి, కొత్తూరు మండలంలో గూడురు, కొత్తూరు(ముగ్గురు), సిద్దాపూర్, కుమ్మరిగూడ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు నగర బాట పట్టారు. కొందరు ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా.. మరికొందరు తమ నివాస ప్రాంతానికి సమీపంలో ఉండే పాఠశాలల్లో పనిచేస్తున్నారు.

రెండు ఇళ్లల్లో చోరీ

బంగారు ఆభరణాల అపహరణ

ఆమనగల్లు: ఉదయ్‌నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు బంగారు, వెండి ఆభరణాల అపహరించారు. ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం కథనం ప్రకారం.. పట్టణంలోని ఉదయనగర్ కాలనీకి చెందిన పాతకోట కిష్టమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా ఉంటోంది. పక్కనే ఉన్న కుమారుడు సాయిలు ఇంట్లో ప్రతిరోజూ రాత్రి నిద్రిస్తూ.. ఉదయం వస్తుంటుంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కుమారుడి ఇంట్లో నిద్రించి ఉదయం ఇంటికి రాగా.. ఇంటి తాళం పగులకొట్టి ఉండటాన్ని గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న వెండి గొలుసులు, తులం బంగారు ఆభరణాలు, నగదు చోరీ అయినట్లు గుర్తించారు. ఇదే కాలనీకి చెందిన తోకల అరుణ తన కుటుంబ సభ్యులతో ఇంట్లో నిద్రిస్తుండగా.. రాత్రి 2 గంటల సమయంలో ఇంట్లోకి చొరబడిన దొంగ.. ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును లాక్కుని వెళ్తుండగా.. దొంగా అని అరవడంతో దుండగుడు పారిపోయినట్లు బాధితురాలు తెలిపింది. వీటిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాలను ఏసీపీ శంషాంక్‌రెడ్డి, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, కడ్తాల్ సీఐ శివప్రసాద్‌లు పరిశీలించి, బాధితుల నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు.

నకిలీ మద్యం ధ్వంసం

అబ్దుల్లాపూర్‌మెట్: రూ.1.30 కోట్ల విలువైన నకిలీ మద్యం సీసాలను హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. 2022లో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసులో విచారణ చేపట్టిన ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తులో భాగంగా ఒడిస్సాలోని అభయారణ్యంలో అనుమతులు లేకుండా తయారు చేస్తున్న నకిలీ మద్యం తయారీ కేంద్రంపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ దాడిలో పట్టుబడిన సుమారు 3వేల లీటర్ల మద్యాన్ని పెద్దఅంబర్‌పేటలోని గోడౌన్‌లో భద్రపర్చారు. రసాయన పరీక్షలు నిర్వహించిన పోలీసులు.. నకిలీ మద్యంగా తేల్చారు. కేసు విచారణ ముగిసిన అనంతరం ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు సమక్షంలో హయత్‌నగర్ సీఐ లక్ష్మణ్‌గౌడ్, ఇబ్రహీంపట్నం సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో హయత్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి పెద్దఅంబర్ పేటలో మద్యం సీసాలను ధ్వంసం చేశారు. దీంతో పాటు వివిధ కేసుల్లో పట్టుబడిన 1,050 కేజీల నల్లబెల్లాన్ని మూసీ నదిలో పారబోసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు వెంకన్న, యాదయ్య, హనుమంతు, సరళ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.